RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 26 బుధవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 203 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా

NALGONDA | WEDNESDAY AUGUST 26 2026 | VOL:16 | ISSUE: 203 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# జీవో 77పై రగడ.. సీఎం రేవంత్ రెడ్డికి థియేటర్ల యజమానుల లేఖ

టికెట్ ధరల జీవో ఏకపక్షమంటూ సీఎంకు ఎగ్జిబిటర్ల ఫిర్యాదు

నిబంధనలు నిర్మాతలకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపణ

సింగిల్ స్క్రీన్లను ఏసీలుగా మార్చాలనడం భారమంటున్న ఓనర్లు

జీవో 77తో గ్రామీణ థియేటర్లు మూతపడతాయని ఆందోళన

జీవోను సవరించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

తెలంగాణలో సినిమా టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 77పై వివాదం ముదురుతోంది. ఈ జీవో ఏకపక్షంగా ఉందని, కేవలం నిర్మాతలకు మేలు చేసేలా రూపొందించారని ఆరోపిస్తూ తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసింది. స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి కీలక భాగస్వామ్య పక్షాలను సంప్రదించకుండా, కేవలం తెలుగు యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ ధరల పెంపు వల్ల ఎగ్జిబిటర్లకు ఎటువంటి లాభం లేదని, థియేటర్ల నిర్వహణ, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి ఆర్థిక భారాలన్నింటినీ తామే భరిస్తున్నామని వారు స్పష్టం చేశారు. కరోనా

(మిగతా 2వ పేజీలో..)



## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ.. కులగణనపై కీలక సూచన



కులగణన విధానంపై ఖర్గే, రాహుల్ అభ్యంతరం

ప్రధాని మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ

ఓపెన్ ఎండెడ్ విధానంతో కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం

కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని డిమాండ్

తెలంగాణ, బిహార్ సర్వేల తరహాలో జాబితా రూపొందించాలని సూచన

కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే

(మిగతా 4వ పేజీలో..)

## 'అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు'.. రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితమన్న కిషన్‌రెడ్డి

అర్హత లేని వ్యక్తులతో భేటీ అవ్వాలనుకున్నారని వ్యాఖ్య

మమ్దానీపై కిషన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు

సీఎం హోదాకు తగిన వారినే కలవాలని సూచన

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర

(మిగతా 2వ పేజీలో..)



## కాంగ్రెస్‌లో కొండా సురేఖ వివాదం.. క్రమశిక్షణా కమిటీ కీలక వ్యాఖ్యలు!

కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు సిఫార్సు

టీపీసీసీ చీఫ్‌కు క్రమశిక్షణా కమిటీ నివేదిక

వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమన్న మల్లు రవి

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రతిపాదించినట్లు సమాచారం

చిన్నారెడ్డిని ప్లానింగ్ కమిషన్ నుంచి తొలగించాలని సూచించినట్లు సమాచారం





కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ వివాదం కీలక మలుపు తిరిగింది. ఈ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణా కమిటీ తన నివేదికను టీపీసీసీ అధ్యక్షుడికి అందించింది. అలాగే మరో సందర్భంలో సీనియర్ నేత చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా కమిటీ తన అభిప్రాయాన్ని నివేదికలో పొందుపర్చినట్లు కమిటీ ఛైర్మన్, ఎంపీ మల్లు రవి వెల్లడించారు. మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో వ్యక్తుల కంటే పార్టీ, క్రమశిక్షణే ముఖ్యమని స్పష్టం చేశారు. పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలను ఉపేక్షించబోమని చెప్పారు. నేతలు మరింత

(మిగతా 2వ పేజీలో..)

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?: హరీశ్ రావు

22ఏ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు

లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు

పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఔా) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే

(మిగతా 2వ పేజీలో..)



# గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

గోదావరి పుష్కరాల పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

వచ్చే ఏడాది జూన్ 26 నుంచి 12 రోజుల పాటు పుష్కరాల నిర్వహణ

రూ.4,026 కోట్ల అంచనాతో 4,932 పనుల పురోగతిపై చర్చ

భక్తులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం

పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది

(మిగతా 4వ పేజీలో..)



## భారతీయులకు ట్రంప్ షాక్.. హెచ్-1బీ వీసాకు రూ.86 లక్షల అదనపు భారం!

హెచ్-1బీపై 1,03,265 డాలర్ల అదనపు రుసుము

ఒక్కో దరఖాస్తుపై సుమారు రూ.86 లక్షల అదనపు భారం

మాస్టర్స్ కోటాలోని 20 వేల వీసాలకూ అదనపు ఫీజు

అమెరికాలో నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను నియమించుకోవడం ఇక సంస్థలకు భారీ భారంగా మారనుంది. హెచ్-1బీ వీసాలపై ట్రంప్ ప్రభుత్వం ఏకంగా




(మిగతా 2వ పేజీలో..)

దేశ టైమ్స్
తెలుగు దినపత్రిక
సత్యం కోసం .... సమాజం కోసం

# జీవో 77పై రగడ.. సీఎం రేవంత్ రెడ్డికి థియేటర్ల యజమానుల లేఖ

(మొదటి పేజీ తరువాయి)

అనంతర కాలంలో ప్రేక్షకులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు గత మూడేళ్లలో సుమారు రూ. 300 కోట్లు వెచ్చించి థియేటర్లను ఆధునికీకరించామని, అయితే ప్రస్తుత నిబంధనల వల్ల టికెట్ ధరలను నిర్ణయించే హక్కును కూడా కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నూతన నిబంధనల ప్రకారం టైర్-2, టైర్-3 పట్టణాల్లోని ఎయిర్-కూల్డ్ థియేటర్లను ఏసీ థియేటర్లుగా మార్చాలంటే ఒక్కో స్క్రీన్‌కు సుమారు రూ. 60 నుండి 80 లక్షల వరకు వ్యయమవుతుందని, ఈ ఆర్థిక భారాన్ని భరించలేక ఇప్పటికే అనేక థియేటర్లు మూతపడ్డాయని వారు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండగా, వాటిపై సుమారు 20,000 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ జీవో అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని థియేటర్లు మూతపడి, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, చిత్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచే ఎగ్జిబిటర్ల ప్రయోజనాలను కాపాడే విధంగా జీవో 77ను పునఃసమీక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఆయన చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## సంపాదకీయం

# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !

అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యాయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి-డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యూఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూ నమ్మరు. అమెరికా

ఆంక్షలప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారని పేర్కొన్నారు.యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణెళి కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరిం చలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హోర్ముజ్ జలసంధి నుంచి చుక్కనూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. మరోవైపు ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదేహ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మరో ఓటమి తప్పదు. వాషింగ్టన్ విధించిన కొత్త ఆంక్షలను ఎదుర్కోవ డానికి మా వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉంది. ఇరాన్ ప్రజలు, దేశ అధికారుల సంకల్పాన్ని పరీక్షించడానికి వారు చేయగలిగిందంతా చేశారు. కానీ ప్రతిసారీ విఫలమయ్యారని యూఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది.

# కాంగ్రెస్‌లో కొండా సురేఖ వివాదం.. క్రమశిక్షణా కమిటీ కీలక వ్యాఖ్యలు!

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాన్ని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మల్లు రవి చెప్పారు. అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని పార్టీ క్రమశిక్షణా కమిటీ ప్రతిపాదించినట్లు సమాచారం. గతంలో హెచ్చరికలు చేసినా ఆమె వైఖరిలో మార్పు రాలేదని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన చిన్నారెడ్డిపై కూడా చర్యలకు సిఫార్సు చేసినట్లు రవి చెప్పారు. ఆయనను ప్లానింగ్ కమిషన్ నుంచి తొలగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇద్దరు నేతలపై చర్యలు తీసుకోకపోతే పార్టీకే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని క్రమశిక్షణా కమిటీ అభిప్రాయపడినట్లు సమచారం. పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే నేతల విషయంలో కఠినంగా ఉండాలని కమిటీ సూచించినట్లు తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల అసెంబ్లీ టికెట్ అంశంలో సీఎం రేవంత్‌రెడ్డిని, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అభ్యర్థిని ఎన్నుకోవడానికి రేవంత్ రెడ్డి ఎవరంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా స్పందించి సురేఖకు షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఇక వనపర్తి రాజకీయాల విషయంలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. తనకు కాకుండా డబ్బులకు ఆశపడి ఇతరులకు టికెట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. పార్టీ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సీనియర్ నేత జీవన్‌రెడ్డిలా తాను కూడా తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ చిన్నారెడ్డికి నోటీసు ఇచ్చింది.

# ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?: హరీశ్ రావు


(మొదటి పేజీ తరువాయి)

వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు.వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# 'అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు'.. రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు .రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు. అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.



# భారతీయులకు ట్రంప్ షాక్.. హెచ్-1బీ వీసాకు రూ.86 లక్షల అదనపు భారం!

(మొదటి పేజీ తరువాయి)

1,03,265 డాలర్ల అదనపు రుసుము విధించాలని ప్రతిపాదించింది. ప్రస్తుత మారకం విలువ ప్రకారం ఇది సుమారు రూ. 86 లక్షలు. భారతీయ ఐటీ నిపుణులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏటా జారీ చేసే 85 వేల హెచ్-1బీ వీసాలన్నింటికీ ఈ రుసుము వర్తించనుంది. అమెరికా యూనివర్సిటీల నుంచి మాస్టర్స్ లేదా అంతకంటే ఉన్నత విద్యార్హత పొందిన వారికి కేటాయించే 20 వేల వీసాలు కూడా ఇందులోనే ఉంటాయి. సాధారణ రుసుములతో పాటు ఈ అదనపు మొత్తాన్ని కూడా సంస్థలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదన ఇంకా తుది రూపం దాల్చలేదు. మంగళవారం ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించిన తర్వాత 30 రోజుల పాటు ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తారు. ఈ రుసుము ద్వారా ఏటా 8.8 బిలియన్ డాలర్లు సమకూరుతాయని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అంచనా వేసింది. వలస దరఖాస్తుల పరిశీలన, మోసాల గుర్తింపు, జాతీయ భద్రత తనిఖీలు, ప్రభుత్వ వ్యవస్థల ఆధునికీకరణకు ఈ నిధులు వినియోగిస్తామని తెలిపింది. వలస న్యాయస్థానాలు, కాన్సులర్ సేవలు, కార్మిక ప్రమాణాల అమలుకూ నిధులు వెళ్తాయని పేర్కొంది. అయితే ఈ నిర్ణయంపై వ్యాపార వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. చిన్న సంస్థలపై భారీ ఆర్థిక ప్రభావం పడుతుందని చెబుతున్నాయి. ఎఫ్‌డబ్ల్యూడీ.యూఎస్ అధ్యక్షుడు టాడ్ షుల్టే దీన్ని అమెరికా వ్యాపార సంస్థలపై భారీ పన్నుగా అభివర్ణించారు.



# పర్యావరణ పరిరక్షణకు బోనకల్‌లో మరో ముందడుగు





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 25 (దేశ టైమ్స్):**

బోనకల్ మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో నూతన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ, ఉపసర్పంచ్ బానోతు కొండ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. రాజేశ్వరి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనంలో పచ్చదనాన్ని మరింత పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పార్టీలకు అతీతంగా నాయకులు కలిసి మొక్కలు నాటడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రావు, బీజేపీ నాయకులు నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దుర్గారావు, సీపీఐ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే పంచాయతీ వార్డు సభ్యులు ఎం. శేషు, మీరా షేక్, పొటు వెంకటేశ్వర్లు, శ్రీను, ఉప్పర శ్రీను, లావణ్య, మాజీ ఎంపీపీ గుగులోతు శ్రీను, గ్రామ నాయకులు పుల్లారావు, చిట్టోజీ ప్రసాద్, బాజీ షేక్, టైగర్ తదితరులు పాల్గొన్నారు. పల్లె ప్రకృతి వనాన్ని మరింత అభివృద్ధి చేసి, నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు.

# వనమహోత్సవం ఒక సామాజిక బాధ్యత: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.





**జర్నలిస్టులు, పిల్లలు, అధికారులతో కలిసి మొక్క నాటిన జిల్లా కలెక్టర్.**

**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 25**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌అటవీశాఖ అధికారి బి.లావణ్య తో కలిసి ఈదులపూసపల్లి లేక్ వ్యూ నేచర్ పార్క్, చెరువు ప్రాంతంలో కలిసి మొక్క నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి విస్తృతంగా మొక్కలు నాటడమే ఏకైక మార్గమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు ప్రతి శాఖకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా, వాటికి ట్రీ–గార్డులు ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా నీరు పోసి కాపాడే బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారుల ఇరువైపులా నాటిన మొక్కల ఎదుగుదలను ఎప్పటికప్పుడు జియో–ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ప్రాంగణంలో లేదా పరిసరాల్లో కనీసం ఒక మొక్క నాటి, దానిని దత్తత తీసుకున్నట్లుగా సంరక్షించాలని ప్రజలను కోరారు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి శుభకార్యాల సందర్భంగా జ్ఞాపకంగా మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచడం, పచ్చదనాన్ని కాపాడుకోవడం మనందరి ప్రాథమిక కర్తవ్యమని గ్రహించి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. జిల్లా లక్ష్యం 43. లక్షల 51 వేలు వివిధ విభాగాలకు చెందిన వారి వారి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు, అనంతరం నందనవనం పార్క్ ను సందర్శించి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఫారెస్ట్ అధికారులకు సూచి,ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఏ. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, ఎఫ్ ఆర్ ఓ సురేష్, మహబూబాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ జ్యోతి, మహబూబాబాద్ తాహసిల్దార్ రాజేశ్వర్, స్థానిక కౌన్సిలర్, మీడియా ప్రతినిధులు, పాటశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నోట్ బుక్స్ పంపిణి కార్యక్రమం

**ఆగస్టు 25: (దేశ టైమ్స్)**

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలను యాదాద్రి భువనగిరి జిల్లా నోడల్ అధికారి సురేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, గంజాయి, మద్యము, సెల్ఫోన్ బైక్ రైడింగ్, మొదలగు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా, చదువుపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నోట్ బుక్స్ ను కళాశాలలోని ప్రతి విద్యార్థికి 12 ఉచిత నోటు బుక్స్ లని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.నరేందర్ రెడ్డి అధ్యాపకులు పరశురాములు, గణేష్, వెంకట చారి,మురళి, భిక్షం, సురేష్ ,కృష్ణ, స్వప్న, మృదుల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## బోనకల్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ.. లబ్ధిదారుల్లో హర్షం

- **అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు: సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 25 (దేశ టైమ్స్):**

బోనకల్ మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. రాజేశ్వరి, డీపీఓ శ్రీనివాసరావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీలకు అతీతంగా నాయకుల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు గుండపనేని సుధాకర్‌రావు, కాంగ్రెస్ నాయకుడు గాలి దుర్గారావు, బీజేపీ నాయకుడు గుగులోతు నాగేశ్వరరావు, సీపీఐ నాయకుడు శ్రీనివాసరావు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శేషు, మీరా షేక్, పొటు వెంకటేశ్వర్లు, శ్రీను, ఉప్పర శ్రీను, మాజీ ఎంపీపీ గుగులోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు. నూతన రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు అందించిన ఈ అవకాశం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

## మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

**ఎల్లంపేటలో వనమహోత్సవం.. మొక్కలు నాటిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్రు నాయక్**

**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 25**



పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు వర్షపాతం పెరగడానికి, భూగర్భ జలాల పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి, పశువుల నుంచి రక్షించి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించేందుకు వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇంటి పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పచ్చదనం పెరిగితే గ్రామాల వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎల్లంపేట గ్రామ సర్పంచ్ రాధమ్మ, ఉపసర్పంచ్ శ్రీదేవి, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి మంజుల, టీఏలు సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

## రుద్రంగిలోఘనంగా వన మహోత్సవం.. మొక్కలు నాటిన సర్పంచ్ గండి నారాయణ

**రుద్రంగి ఆగస్టు25(దేశ టైమ్స్)**



రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్నీ పెంపొందించడానికి అలాగే పర్యావరణ పరిరక్షణే ద్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమన్నీ రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ,ఎంపిడిఓ నట్రజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నటారు,ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి ఒక్కరు వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో,కార్యదర్శి స్వామి, ఐకెపి ఎపిఎం రజిత,వార్డు మెంబర్లు,శీలం స్వాతి మీనయ్య, గసికంటి రాజు,అంబటి శ్రీనివాస్,పుదరి మహిపాల్,గంధం మనోజ్,ద్యావల రవి,దయ్యాల సాగర్,లావుడ్యా సతీష్, శ్రీనివాస్,పుట్కపు మహిపాల్,టిఏ దనుంజయ్, పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ.. కులగణనపై కీలక సూచన

(మొదటి పేజీ తరువాయి)

అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు.కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంథ్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చన్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు.ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల పనుల పురోగతిపై సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 2025 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే ఈ మహా వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రవాణా, పారిశుద్ధ్యం, నిరంతరాయ తాగునీటి సరఫరా, వైద్య సేవలు, భద్రత, వసతి కల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పుష్కరాల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా ఒక ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.పుష్కరాల కోసం రూ.4,026 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 4,932 పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యశ్ 'టాక్సిక్' హంగామా.. తెలుగు రాష్ట్రాల్లో మొదలైన టికెట్ల సందడి

'కేజీఎఫ్' చిత్రాలతో పాన్-ఇండియా స్టార్‌గా అశేష ప్రేక్షకాదరణ పొందిన రాకింగ్ స్టార్ యశ్, తన కొత్త చిత్రం 'టాక్సిక్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా రేపు (ఆగస్టు 26) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన మల్టీప్లెక్స్‌లు, థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. "ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించడం విశేషం. అంతేకాకుండా, ఈ సినిమాకు యశ్ సహ-రచయితగా, నిర్మాతగా కూడా వ్యవహరించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్‌లపై వెంకట్ కె నారాయణతో కలిసి యశ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ వంటి భారీ తారాగణం నటిస్తుండటంతో సినిమా స్థాయి మరింత పెరిగింది.'కేజీఎఫ్' సిరీస్‌కు అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన రవి బస్రూర్ ఈ సినిమాకు కూడా సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. యశ్, రవి బస్రూర్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడంతో సినిమా ఆడియోపై కూడా అంచనాలు పెరిగాయి. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్వీసీ రిలీజ్) ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ప్రస్తుతం టికెట్ల బుకింగ్స్ వేగంగా జరుగుతుండగా, 'టాక్సిక్' ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు యశ్ అభిమానులు, సినీ ప్రియులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.



# రైతే రాజు.. కానీ రైతు కష్టాలు ఎవరికి తెలుసు?

**అన్నదాత కష్టాలు వర్ణనాతీతం.. పెట్టుబడులు పెరిగి, ఆదాయం తగ్గుతున్న దుస్థితి**

**బ్యాంకు రుణాలు.. ప్రైవేట్ అప్పులు.. పెరుగుతున్న సాగు ఖర్చులు.. గిట్టుబాటు ధర కోసం రైతు ఎదురుచూపులు**

**రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.. మాటల్లో కాకుండా చేతల్లో రైతు సంక్షేమం కావాలంటున్న అన్నదాతలు**



**దేశటైమ్స్మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 25**

'రైతే రాజు.. రైతు లేనిదే దేశానికి మనుగడ లేదు' అని నిత్యం పాలకులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టాలు మాత్రం అంతులేకుండా ఉన్నాయి. కుటుంబ సభ్యుల కష్టంతో పాటు ప్రకృతిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతన్నకు ప్రతి సీజన్ ఒక కొత్త సవాలుగా మారుతోంది. పంట సాగు కోసం పెట్టుబడి పెట్టినప్పటి నుంచి పంటను విక్రయించే వరకు అడుగడుగునా సమస్యలే ఎదురవుతున్నాయి.

**పెట్టుబడుల భారం.. ఆదాయంపై అనిశ్చితి**

వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, దుక్కులు, నాట్లు, కోతలు, రవాణా తదితర ఖర్చులు రైతుపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఒక పంట సాగు చేయడానికి వేలాది రూపాయలు ఖర్చు చేసినా.. చివరకు పంట దిగుబడి ఎలా వస్తుందో, మార్కెట్లో ఎంత ధర లభిస్తుందో రైతుకు ముందే తెలియని పరిస్థితి నెలకొంది.వర్షాలు సకాలంలో కురవకపోతే పంట దెబ్బతింటుంది. అధిక వర్షాలు కురిసినా పంట నష్టపోతుంది. చీడపీడలు, తెగుళ్లు సోకితే అదనంగా పురుగుమందుల కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా ప్రతి దశలోనూ రైతుకు ఖర్చు పెరుగుతూనే ఉంది.

**బ్యాంకు రుణం.. రైతుకు మరో భారమే**

సాగు పెట్టుబడుల కోసం రైతులు బ్యాంకులపై ఆధారపడుతున్నారు. పంట రుణాలు తీసుకుని వ్యవసాయం చేస్తారు. అయితే పంట సకాలంలో చేతికి రాకపోయినా, మార్కెట్లో ధర పడిపోయినా రుణం చెల్లించడం రైతుకు భారంగా మారుతోంది. బ్యాంకు రుణం తీర్చేందుకు మరోసారి అప్పు చేయాల్సిన పరిస్థితులు కూడా అనేక కుటుంబాల్లో కనిపిస్తున్నాయి.బ్యాంకు రుణంతో పాటు వ్యవసాయ అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోంది. పంట చేతికి వచ్చిన తర్వాత ముందుగా అప్పులు తీర్చాల్సి ఉండటంతో రైతు చేతిలో మిగిలేది చాలా తక్కువగా ఉంటోంది.

**పంట పండించినా.. ధర రైతు చేతిలో లేదు**

రైతు కష్టపడి పంట పండిస్తాడు. కానీ పంటకు ధర నిర్ణయించే విషయంలో మాత్రం రైతు పాత్ర చాలా పరిమితంగా ఉంటుంది. మార్కెట్లో ధరలు తగ్గిన సమయంలో రైతు తన పంటను నిల్వ చేసుకునే సదుపాయం లేక తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోంది.పంటకు గిట్టుబాటు ధర లభిస్తేనే రైతు కుటుంబం నిలదొక్కుకోగలదు. సాగు ఖర్చులు, కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వైద్యం, అప్పుల చెల్లింపులు ఇలా ఎన్నో బాధ్యతలు రైతుపైనే ఉంటాయి. పంటకు సరైన ధర రాకపోతే ఆ ప్రభావం కుటుంబం మొత్తంపై పడుతోంది.

**'రైతే రాజు' మాటలకు చేతల్లో బలం కావాలి**

రైతును దేశానికి వెన్నెముకగా, అన్నదాతగా, రాజుగా పిలవడం మాత్రమే కాకుండా అతని కష్టాలను అర్థం చేసుకుని ఆచరణాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సాగు ఖర్చులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధర, సకాలంలో రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల లభ్యత, పంట బీమా, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి.ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం సకాలంలో అందాలి. పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావాలి. మధ్యవర్తుల ప్రభావం తగ్గి రైతుకు నేరుగా మెరుగైన ధర లభించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి.రైతు కన్నీరు తుడిస్తేనే నిజమైన రైతు సంక్షేమం దేశ ప్రజలందరికీ అన్నం అందించే రైతు మాత్రం తన కుటుంబాన్ని పోషించేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడు. రైతు కష్టాన్ని కేవలం ఎన్నికల సమయంలోనో, రైతు దినోత్సవాల సందర్భంలోనో గుర్తు చేసుకోవడం కాకుండా.. ఏడాది పొడవునా రైతుకు అండగా నిలిచే విధానాలు అవసరం."రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది.. గ్రామం బాగుంటేనే దేశం బాగుంటుంది." రైతు కష్టానికి తగిన ప్రతిఫలం లభించే రోజు వచ్చినప్పుడే 'రైతే రాజు' అనే నినాదానికి నిజమైన అర్థం వస్తుందని రైతు కుటుంబాలు ఆశిస్తున్నాయి.

# తెలుగులోకి మమితా బైజు మలయాళ హిట్ మూవీ!

**మలయాళ మూవీగా 'బెత్లేహం కుటుంబ యూనిట్'**

**నవీన్ పౌలి జోడీగా అలరించిన మమితా బైజు**

**ఈ నెల 21వ తేదీన విడుదలైన సినిమా**

**60 కోట్లకి పైగా రాబట్టిన వసూళ్లు**

**సెప్టెంబర్ 4 నుంచి తెలుగు ప్రేక్షకుల ముందుకు**

'ప్రేమలు' సినిమా నుంచి మమితా బైజు తన జోరును కొనసాగిస్తూ వెళుతోంది. ఒక్కొక్కటిగా ఆమె భారీ ప్రాజెక్టులు థియేటర్స్ కి వస్తున్నాయి. ఆమె నటనకు మంచి మార్కులు తెచ్చిపెడుతున్నాయి. అలాంటి మమితా బైజు, రీసెంటుగా మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. ఆ సినిమా పేరే 'బెత్లేహం కుటుంబ యూనిట్'. మలయాళంలో రూపొందిన ఈ సినిమాకి గిరీశ్ దర్శకత్వం వహించాడు. నిర్మాతలలో ఒకరిగా ఫహాద్ ఫాజిల్ వ్యవహరించిన సినిమా ఇది. మలయాళంలో నవీన్ పౌలికి మంచి క్రేజ్ ఉంది. ఆయన ఎంచుకునే కథలు .. పాత్రలు .. సహజమైన ఆయన నటనే అందుకు కారణమని చెప్పాలి. ఓటీటీ సినిమాల కారణంగా ఇతర భాషలలోను ఆయనకి అభిమానులు ఉన్నారు. అలాంటి నివిన్ పౌలి కథానాయకుడిగా నటించిన సినిమా ఇది. ఆయన జోడీగా మమితా బైజు నటించిన ఈ సినిమా, అక్కడి యూత్ ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ ఆడియన్స్ వైపు నుంచి కూడా ఈ సినిమాకి మంచి మద్దతు లభిస్తోంది. విష్ణు విజయ్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాను, ఈ నెల 21వ తేదీన అక్కడి థియేటర్లలో విడుదల చేశారు. 60 కోట్లకి పైగా వసూళ్లతో ఈ సినిమా అక్కడ తన దూకుడు చూపిస్తోంది. రొమాంటిక్ కామెడీ జోనర్లో నిర్మితమైన ఈ సినిమాను, తెలుగులోనూ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సెప్టెంబర్ 4వ తేదీన ఈ సినిమాను తెలుగులో విడుదల చేయనున్నట్టుగా అధికారిక ప్రకటన చేశారు. మరి ఈ సినిమా ఇక్కడి థియేటర్ల వైపు నుంచి ఏ స్థాయి వసూళ్లను రాబడుతుందనేది చూడాలి.




Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280